ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

ఆదివారం | జూన్ 07, 2026 | సంపుటి : 7 | సంచిక : 09 | పేజీలు : 2

ప్రతిపక్షాలను ఎదుర్కోలేక ఓట్ల తొలగింపు

- అధికారాన్ని నిలబెట్టుకోవాలని మత విద్వేషాలు రెచ్చగొడుతోంది
- రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంది
- నియోజకవర్గంలో సాగునీరు, విద్యా, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

2 లో

ఢిల్లీ, ఆయుధం:

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు నెలకొన్న వేళ భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఆర్థిక సలహా మండలి(ఈఏసీ) సభ్యులతో సమావేశమయ్యారు. మన దేశ ఆర్థిక వృద్ధిని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన వ్యూహాలు, చర్యలు గురించి చర్చించారు. సామాన్య ప్రజల జీవన సౌలభ్యం, వ్యాపార నిర్వహణ సౌలభ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా చేపట్టాల్సిన సంస్కరణలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత్‌పై, అలాగే ప్రపంచంపై చూపే ప్రభావంపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశం జరిగిన మరుసటి రోజే ఈ సమావేశం జరగడం గమనార్హం.

ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఈఏసీ మీటింగ్

దేశ ఆర్థికాభివృద్ధి వ్యూహాలపై చర్చ

2 లో

ధాన్యం కొనుగోళ్లు స్పీడప్ చేయాలి

- రెండు రోజుల్లో రాష్ట్రానికి రుతు పవనాలు
- కలెక్టర్లకు సీఎస్ రామకృష్ణారావు ఆదేశాలు

హన్మకొండ, ఆయుధం: మరో రెండు రోజుల్లో రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రాన్ని తాకనున్న నేపథ్యంలో జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లను ఆదేశించారు. శనివారం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వరి కొనుగోలు ప్రక్రియ, జూన్ 21న నిర్వహించే నీట్ పరీక్ష, జూన్ 9న జరిగే మండల మహిళా సమాఖ్య సభ్యులకు ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి, వివిధ శాఖల జిల్లా అధికారులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాల్లో నీట్ పరీక్ష నిర్వహణకు సంబంధించిన అంశం గురించి సిఎస్ రామకృష్ణారావు అడుగగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి వివరాలు తెలియజేశారు. జిల్లాలో నీట్ పరీక్ష నిర్వహణకు పటిష్ట చర్యలు చేపడతామని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లను పూర్తి చేస్తామన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. గతంలోనూ నిర్వహించిన పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేసి విజయవంతంగా నిర్వహించామని, అదేవిధంగా జూన్ 21న నిర్వహించే నీట్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేస్తామన్నారు. పరీక్ష నిర్వహణలో రూట్ ఆఫీసర్లు, సిట్టింగ్ స్క్వాడ్ లను నియమించనున్నట్లు తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈనెల తొమ్మిదో తేదీన హైదరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో జరిగే సభకు జిల్లా నుండి మహిళా సంఘాల సభ్యులు ఆర్టీసీ బస్సుల్లో సకాలంలో చేరే విధంగా చూడాలన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా యువజన, క్రీడాధికారి కొత్త ప్రశాంత్, హనుమకొండ ఏసిపి నరసింహారావు, కలెక్టరేట్ ఏవో గౌరీ శంకర్, జిల్లా పౌర సరఫరాలు శాఖ అధికారి మహ్మద్ వాజీద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, అడిషనల్ డీఆర్డీవో వెంకటేశ్వర్లు, గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్ధార్థ నాయక్, ఆర్టీసీ డీఎం ధరమ్ సింగ్, నీట్ ఎగ్జామ్ జిల్లా కో ఆర్డినేటర్ భిక్షపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ శిక్షణ తరగతులు ప్రారంభం

- హాజరైన ఎంపీలు ఈటల, రఘునందన్ రావు, బీజేపీ శ్రేణులు

వరంగల్, ఆయుధం: బీజేపీ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో "పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ 2026" శిక్షణా కార్యక్రమం వాగ్దేవి కాలేజ్ బొల్లికుంటలో అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. మొదటిరోజు ప్రశిక్షణ శిబిరంలో ఏడు కాలంశాలు నిర్వహించారు. ప్రశిక్షణ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు హాజరై బిజెపి జెండా ఆవిష్కరించి, అనంతరం దేశ సేవలో బీజేపీ చేసిన పోరాటాలు, తెలంగాణ మలిదశ ఉద్యమంలో పార్టీ పాత్ర, ప్రజా చైతన్య కార్యక్రమాలకు సంబంధించిన ప్రత్యేక ఫొటో ప్రదర్శనను వారు సందర్శించారు. అలాగే చందుపట్ల జంగారెడ్డి సభ వేదిక ప్రాంగణాన్ని ప్రారంభించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన మొదటి కాలాంశంలో రఘునందన్ రావు పాల్గొని ప్రశిక్షణ నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ అధ్యక్షతన అధ్యక్షతన నిర్వహించిన రెండవ కాలంశానికి ముఖ్యఅతిథిగా మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొని ప్రస్తుత రాష్ట్ర రాజకీయాలపై కార్యకర్తలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. రైతాంగ సంక్షేమం, నిరుద్యోగ సమస్యల పరిష్కారంలో ప్రస్తుత ప్రభుత్వం ఘోరంగా (మిగతా 2లో)

నిర్మాణ రంగంలో భాగస్వాములైన కాంట్రాక్టర్లను ఆదుకోవాలి

- సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలి
- ఈనెల 18న భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు ప్రకటిస్తాం
- బీఏఐ జాతీయ ఉపాధ్యక్షులు వేముల సత్యమూర్తి

హన్మకొండ, ఆయుధం: నిర్మాణ రంగాన్ని నమ్ముకుని దేశ ప్రగతిలో భాగస్వాములవుతున్న కాంట్రాక్టర్లను ప్రభుత్వం ఆదుకోవాలని, సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) జాతీయ ఉపాధ్యక్షులు వేముల సత్యమూర్తి డిమాండ్ చేశారు. శనివారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో వేముల సత్యమూర్తి కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, పెండింగ్ బిల్లుల వల్ల నిలిచిపోయిన అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మీడియాకు వెల్లడించిన ముఖ్య అంశాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టే మౌలిక సదుపాయాల కల్పన, రహదారులు, భవనాలు, ఇతర అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు తమ సొంత నిధులు, బ్యాంకు రుణాలు, బయట తెచ్చిన అప్పులతో సకాలంలో పూర్తి చేస్తున్నారని వేముల సత్యమూర్తి పేర్కొన్నారు. అయితే, పనులు పూర్తయినా నెలల తరబడి, కొన్ని చోట్ల సంవత్సరాల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర మానసిక, ఆర్థిక ఆవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డీల భారం పెరిగిపోయి, కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని, ఉపాధి కల్పిస్తున్న కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వలేని దుస్థితి నెలకొందని ఆయన అన్నారు.

జూన్ 18న ఏం జరగబోతోంది?

కాంట్రాక్టర్ల సమస్యలను, వారి ఆక్రందనలను ప్రభుత్వం దృష్టికి బలంగా తీసుకెళ్లేందుకు జూన్ 18న భారీ కార్యాచరణకు పూనుకోబోతున్నట్లు వేముల సత్యమూర్తి హెచ్చరించారు. ఈ లోగా ప్రభుత్వం స్పందించి సానుకూల నిర్ణయం తీసుకోకపోతే, కాంట్రాక్టర్ల ఆత్మ గౌరవాన్ని, హక్కులను కాపాడుకునేందుకు దేశవ్యాప్తంగా లేదా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బిల్డర్లు, కాంట్రాక్టర్లందరినీ ఏకం చేసి తదుపరి ఉమ్మడి కార్యాచరణను జూన్ 18న ప్రకటించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఆ రోజున కాంట్రాక్టర్ల భవిష్యత్తు, అభివృద్ధి పనుల నిలిపివేతపై కీలక నిర్ణయాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల నిర్మాణ పనుల బిల్లులను ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే క్లియర్ చేయాలని, కాంట్రాక్టర్లను నష్టాల నుంచి, బ్యాంకుల జప్తుల నుంచి కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని, బిల్లుల చెల్లింపుల్లో పారదర్శకత ఉండాలని, పనులు పూర్తయిన నిర్దిష్ట గడువులోనే నిధులు విడుదలయ్యేలా శాశ్వత జీవోను తీసుకురావాలని వేముల సత్యమూర్తి డిమాండ్ చేశారు. నిర్మాణ రంగం కుప్పకూలితే దానిపై ఆధారపడ్డ లక్షలాది మంది కార్మికుల జీవితాలు అంధకారమవుతాయని, కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లుల సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని వేముల సత్యమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర మాజీ చైర్మన్ లు బి.సుగుణాకర్ రావు, కట్కూరి దేవేందర్ రెడ్డి, యు.సురేందర్, బీఏఐ రాష్ట్ర అడ్వైజర్ కె.ప్రభాకర్ రెడ్డి, జనగామ సెంటర్ మాజీ చైర్మన్ ఇమ్మడి దేవేందర్ రెడ్డి, వరంగల్ సెంటర్ చైర్మన్ ఈ.మనోజ్, శ్రీ వెంకటేశ్వర కన్స్ట్రక్షన్స్ మేనేజింగ్ పార్టనర్ మాధిరెడ్డి రవిందర్ రెడ్డి, ఎంఎన్ మూర్తి తదితరులు పెద్ద సంఖ్యలో కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పోతన–హంటర్ రోడ్ మార్గం అభివృద్ధి పనులు స్పీడప్ చేయాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

హనుమకొండ, ఆయుధం: వరంగల్ నగరంలోని పోతన సర్కిల్ నుంచి హంటర్ రోడ్ సర్కిల్ వరకు ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న రహదారి నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. సోమవారం సంబంధిత ప్రాంతాన్ని సందర్శించిన కలెక్టర్, మణిదీపం గార్డెన్ వద్ద కల్వర్టుల నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు పూర్తైన నేపథ్యంలో మిగిలిన డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరగా ముగించాలని సూచించారు. అనంతరం పోతన ఎక్స్‌రోడ్ నుంచి హంటర్ రోడ్ ఎక్స్‌రోడ్ వరకు సుమారు 1.6 కిలోమీటర్ల మేర చేపట్టనున్న రహదారి నిర్మాణంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేందర్, ఎం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, డీఈ దేవిక చౌహాన్, ఏఈలు హరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రత పోలీసుల ప్రధాన లక్ష్యం

- పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

హనుమకొండ, ఆయుధం: మహిళ భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు పనిచేస్తారని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా రెవిన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో శనివారం ధర్మసాగర్ మండలం పెండ్యాల గ్రామంలో గ్రామ సభను నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో గ్రామస్తులను ఉదేశించి వరంగల్ సీపీ ముందుగా మహిళ భద్రత గురించి మాట్లాడుతూ.. ప్రతి మహిళ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగిపోవాలని అన్నారు. ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని.. మహిళలు తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే ఆత్మ విశ్వాసం అవసరమని సూచించారు. మహిళల భద్రతకై షీ టీం విభాగం పనిచేస్తుందని.. ఎవరైనా వేధింపులకు పాల్పడితే మౌనం వీడి పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. మహిళలు తమ. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, పిల్లల అభివృద్ధి లో మహిళల పాత్ర కీలకమని సీపీ చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు బాధ్యాయుతంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించగలమని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ధర్మసాగర్ ఇన్స్ స్పెక్టర్ శ్రీధర్ రావు, స్థానిక సర్పంచ్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం

హైదరాబాద్. ఆయుధం:

నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, బోరబండ, యూసుఫ్‌గూడ, ఎస్ఆర్ నగర్, సనత్‌నగర్, రాయదుర్గం, హైదర్‌గూడ, ఉప్పరపల్లి, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్ నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో కొంతకాలంగా వేసవి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన నగరవాసులకు కొంత ఉపశమనం కలిగింది. మరోవైపు రంగారెడ్డి జిల్లా కోహెడ, పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. మరికాసేపట్లో కోహెడ పండ్ల మార్కెట్ నిర్మాణ పనుల శంకుస్థాపనకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు.

ఈవీఎంల గోదాం తనిఖీ

హనుమకొండ, ఆయుధం: హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్ భవనం వెనుక ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు (ఈవీఎంలు), వివిప్యాట్‌లు భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి శనివారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఈ పరిశీలన చేపట్టారు. గోదాములో పటిష్ట భద్రత నడుమ భద్రపరిచిన ఈవీఎంలు, వివిప్యాట్‌లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రి నిల్వ ఉంచిన గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, గోదాం భద్రతా వ్యవస్థలను సమీక్షించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి,గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇ.వి. శ్రీనివాసరావు, రావు అమరేందర్ రెడ్డి, కుసుమ శ్యాంసుందర్, నాగబెల్లి రజనీ కాంత్, సయ్యద్ ఫైజుల్లా, మణి, లక్ష్మణ్, ఎం.డి. నేహాల్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలు

- వరంగల్ వాసవి క్లబ్‌ను సందర్శించిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సిద్ధ వెంకట సూర్యప్రకాష్ రావు

చిన్న వడ్డేపల్లి చెరువు పనులు పూర్తి చేయాలి

2 లో

చిన్న వడ్డేపల్లి చెరువు అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

వరంగల్, ఆయుధం: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్‌లో ఉన్న దేశాయిపేట చిన్న వడ్డేపల్లి చెరువును జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అమృత్ పథకం కింద చేపడుతున్న చెరువు అభివృద్ధి పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. చెరువు కట్ట (బండ్) బలోపేతం, విస్తరణ, పనులతో పాటు జరుగుతున్న ఇతర అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో చెరువుకు సంబంధించిన అన్ని పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బండ్ వెడల్పు, బలోపేత పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. అదేవిధంగా వినాయక నిమజ్జనాల సందర్భంగా భక్తులకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించేందుకు చెరువు పక్కన సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుచరణ్, బల్దియా ఈఈ సంతోష్ బాబు, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, డీఈ ముజమ్మిల్, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నివారించాలి..

హనుమకొండ, ఆయుధం: 99 రోజుల కార్యాచరణ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పురస్కరించుకొని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, హనుమకొండ జిల్లా ఎన్‌జీసీ కోఆర్డినేటర్ లు సంయుక్తంగా కళాశాలల విద్యార్థుల తోకలిసి ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ ను వాడకం..పర్యావరణ కాలుష్యం ద్వారా ఏర్పడే దుష్పరిణామాలను నివారించడంలో భాగస్వాములు కావాలని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ శాస్త్రవేత్త బి.జీముత వాహన పిలుపునిచ్చారు. నేషనల్ గ్రీన్ కార్ప్స్ హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్, జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాస స్వామి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల యాజమాన్యాన్ని పటిష్టంగా నిర్వహించడంతోపాటు ఏక వినియోగ ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, గాజు, స్టీల్ బాటిల్స్, విస్తర్లు మొదలగు సహజ ఉత్పత్తులను ఉపయోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది, సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఈసెట్ స్టేట్ 4వ ర్యాంకర్ మనోజ్ఞకు ఘన సన్మానం

వరంగల్, ఆయుధం: ఇటీవల తెలంగాణ రాష్ట్ర ఈసెట్ ఫలితాలలో స్టేట్ 4వ ర్యాంక్ సాధించిన వరంగల్ నగరంలో గల రంగశాయిపేట ప్రాంతానికి చెందిన కుసుమ రాజసమయ్య కవిత ద్వితీయ కుమార్తె అయినటువంటి కుసుమ మనోజ్ఞను కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షులు జక్కుం దామోదర్ వ్యాయామ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బొలిశెట్టి కమలాకర్ హాజరై కుసుమ మనోజ్ఞను శాలువతో సన్మానించి స్వీట్ అందించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన దామోదర్ కమలాకర్ మాట్లాడుతూ... ముందు ముందు ఇలాగే కష్టపడి మంచి ఫలితాలను సాధించి అభివృద్ధిలో కి రావాలని వారు కోరారు. సేవా సమితి అధ్యక్షులు మండల నరసింహ రాములు మాట్లాడుతూ..తల్లిదండ్రుల కష్టానికి తగిన ఫలితాన్ని సాధించినటువంటి కుసుమ మనోజ్ఞ భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కుసుమ మనోజ్ఞ నివాసానికి సేవా సమితి సభ్యులు చేరుకొని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆరెల్లి శ్రీనివాస్, మిత్ర పరపతి సంఘం అధ్యక్షులు చిగిరి కుమారస్వామి, కౌటం రమేష్, బూర సంతోష్ కుమార్, కేదాసి రాజేష్, పూల మల్లికార్జున్, కోకా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

హనుమకొండ, ఆయుధం: జిల్లాలో కొనసాగుతున్న సర్వే పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భూ రికార్డులు, భూ కొలతల శాఖ అధికారులు, సర్వేయర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ వివిధ సర్వే పనుల పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వ, పట్టా భూముల హద్దుల నిర్ధారణ, గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించిన సర్వే, రీసర్వే కార్యక్రమాలు, చెరువుల శిఖం (వెట్‌ల్యాండ్స్) భూముల గుర్తింపు, కొలతలు తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రత్యేకంగా చెరువు శిఖం భూముల సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జానకీపురం, ముచ్చర్ల గ్రామాల్లో కొనసాగుతున్న రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి పెండింగ్ అంశాలను పరిష్కరించాలని ఆదేశించారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో సర్వే కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న కలెక్టర్, ఖచ్చితత్వంతో కూడిన సర్వే నిర్వహణ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చన్నారు. ప్రతి కేసును బాధ్యతాయుతంగా పరిశీలిస్తూ నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో భూ రికార్డులు, భూ కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు సారంగపాణి, రాజనర్సయ్యతో పాటు జిల్లాలోని 14 మండలాల సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఈఏసీ మీటింగ్

- దేశ ఆర్థికాభివృద్ధి వ్యూహాలపై చర్చ
- ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల వేళ ఆర్థిక సలహా మండలి సభ్యులతో సమావేశమైన ప్రధాని మోదీ



ఢిల్లీ, ఆయుధం: ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు నెలకొన్న వేళ భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఆర్థిక సలహా మండలి(ఈఏసీ) సభ్యులతో సమావేశమయ్యారు. మన దేశ ఆర్థిక వృద్ధిని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన వ్యూహాలు, చర్యలు గురించి చర్చించారు. సామాన్య ప్రజల జీవన సౌలభ్యం, వ్యాపార నిర్వహణ సౌలభ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా చేపట్టాల్సిన సంస్కరణలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత్‌పై, అలాగే ప్రపంచంపై చూపే ప్రభావంపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశం జరిగిన మరుసటి రోజే ఈ సమావేశం జరగడం గమనార్హం.

భారత్ వృద్ధి పథం

కాగా, శుక్రవారం ఆర్‌బీఐ గవర్నర్ కీలక ప్రకటనలు చేశారు. ప్రస్తుత భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు, సప్లై చెయిన్ అంతరాయాలు ఉన్నప్పటికీ, రెపోరేటును 2.52 శాతం వద్ద యథాతథంగా ఉంచుతున్నట్లు ప్రకటించారు. ఈ విషయంలో తాము తటస్థ వైఖరిని అవలంబిస్తున్నామని స్పష్టం చేశారు.
ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, స్థూల ఆర్థిక పరిస్థితులను సమీక్షించిన తర్వాత, లిక్విడిటీ అడ్జస్ట్‌మెంట్ ఫెసిలిటీ కింద రెపో రేటును మార్చకుండా 5.25 శాతం వద్దే ఉంచాలని ఎంపీసీ నిర్ణయించిందని చెప్పారు. దీని ప్రకారం, స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ 5 శాతం వద్ద, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటు 5.5 వద్ద కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన అనిశ్చితితో ఉందని, కీలకమైన వాణిజ్య మార్గాలు, సప్లై చెయిన్‌లకు అవాంతరాలు ఏర్పడుతున్నాయని అన్నారు. వీటికి తోడు మార్కెట్ ఒడుదొడుకులు లాంటి సవాళ్లు ఎదుర్కొంటున్నామని ఆయన పేర్కొన్నారు. అయితే గతంలో వచ్చిన ఇలాంటి పరిస్థితులతో పోల్చితే, నేడు భారత్ మరింత పటిష్టంగా ఉందని, సంక్షోభాలను సమర్థవంతంగా ఎదుర్కొంటోందని అన్నారు. అయితే ప్రస్తుతం ఎదురవుతున్న అవాంతరాలను మనదేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి వచ్చిన ఒక అవకాశంగా పాలసీదారులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

అంచనాలను మించి

ఇదిలా ఉండగా, జూన్ 5న విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం, 202526 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో భారత ఆర్థిక వ్యవస్థ మార్కెట్ అంచనాలకు మించి రాణించింది. వార్షిక ప్రాతిపదికన వాస్తవ స్థూల దేశీయోత్పత్తి (రియల్ జీడీపీ) వృద్ధిరేటు 7.8 శాతంగా ఉండగా, పూర్తి సంవత్సర వృద్ధి రేటు 7.7 శాతంగా నమోదు అయ్యింది. స్థిర ధరల ప్రకారం, 202526 నాలుగో త్రైమాసికంలో వాస్తవ జీడీపీ రూ.87.77 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఇది గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.81.40 లక్షల కోట్ల కంటే చాలా ఎక్కువ. ఇక ప్రస్తుత త్రైమాసికానికి నామినల్ జీడీపీ రూ.94.65 లక్షల కోట్లుగా అంచనా.

ప్రతిపక్షాలను ఎదుర్కోలేక సవరణ పేరుతో ఓట్ల తొలగింపు

- అధికారాన్ని నిలబెట్టుకోవాలని మత విద్వేషాలు రెచ్చగొడుతోంది
- దేశంలో ప్రజా స్వామ్యం ఎన్నికలపైనే ఆధారపడి ఉంది
- ఎన్నికలు సక్రమంగా జరిగితేనే ప్రజా స్వామ్యంపై ప్రజలకు నమ్మకం
- రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంది
- నియోజకవర్గంలో సాగునీరు, విద్యా, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత
- ఈ నెల 9న ఉప ముఖ్యమంత్రి తో విద్యుత్ సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవాలు

రఘునాథపల్లి, ఆయుధం: దేశంలో ప్రతిపక్షాలను రాజకీయంగా ఎదుర్కోలేక ఓట్ల తొలగింపుతో అధికారాన్ని కాపాడుకోవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రఘునాథపల్లి మండలం నీడిగొండ లో బూత్ లెవల్ ఏజెంట్స్ (BLA'S) శిక్షణ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...దేశంలో ప్రజాస్వామ్యం ఎన్నికల పైనే ఆధారపడి ఉందని.. ఎన్నికలు సక్రమంగా జరిగితేనే ప్రజలకు ప్రజాస్వామ్యంపై నమ్మకం కలుగుతుందని అన్నారు. అప్పుడే ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు చేసి ప్రభుత్వాలను ఎన్నుకుంటారని తెలిపారు. కానీ కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం అధికారాన్ని నిలబెట్టుకోవడానికి కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతుందని ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రతీ పక్షాల అనుకూల ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తోందని అన్నారు. ఓటర్ల జాబితా సవరణ జరిగిన మూడు రాష్ట్రాలలో ఎన్నికలలో ముగ్గురు ముఖ్యమంత్రులు ఓడిపోయారని వెల్లడించారు. దీని ద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాలలో ప్రతిపక్షాల అనుకూల ఓట్లను తొలగించి బీజేపీ అధికారంలోకి రావాలని చూస్తోందని తెలిపారు. ఈ మధ్య తెలంగాణ బీజేపీ నాయకులు మా తర్వాత టార్గెట్ తెలంగాణ అని అంటున్నారని దానికి కారణం తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ (SIR) జరగడమేనని పేర్కొన్నారు. ఈ ఓటర్ల జాబితా సవరణ (SIR) పట్ల ప్రతీ ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా బూత్ లెవల్ ఏజెంట్స్ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలో ఇల్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తోందని ఈ రోజు రాష్ట్రంలోని ఏ గ్రామానికి వెళ్లిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు కనిపిస్తున్నాయని తెలిపారు. అలాగే పేద ప్రజల ఆకలిని గుర్తించి దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణి చేస్తున్న ఏకైక ప్రభుత్వం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే నని అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో సైతం కాంగ్రెస్ బలం పెరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే ఎన్నికల తర్వాత జరిగిన ఎంపీ, సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకకు నిదర్శనం అని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి 1420కోట్ల నిధులతో పనులు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో సాగునీరు, విద్యా, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పని చేస్తున్నానని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక వరి ధాన్యం దిగుబడి వచ్చిన నియోజకవర్గం స్టేషన్ ఘనపూర్.. అని దీనికి కారణం దేవాదుల ద్వారా ప్రతీ గ్రామానికి సాగు నీరు అందించడమేనని తెలిపారు. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టేందుకు 33/11 కేవి సబ్ స్టేషన్లు నిర్మాణం చేపట్టినట్లు.. వీటికి ఈ నెల 9న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు దుద్దిళ్ల శ్రీనివాస్, బూత్ లెవల్ ఏజెంట్స్ ట్రైనర్ పి. రాజశేఖరరెడ్డి, జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపాలిటీ చైర్మన్ తాటికొండ వినయ్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, అలాగే జనగామ, హనుమకొండ జిల్లాల కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, మండలాల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ద్వేషపూరితమైన ప్రసంగాలు నగర ప్రతిష్టకు భంగం

- ప్రిస్కో మేయర్ అభ్యర్థి మార్క్ హిల్

ప్రిస్కో, ఆయుధం: టెక్సాస్ లోని మెకిన్నీ సోరింగ్ హైట్స్ వేదికగా ఏర్పాటు చేసిన 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో ప్రిస్కో మేయర్ అభ్యర్థి మార్క్ హిల్ ప్రసంగిస్తూ, తన ప్రిస్కోను ఐక్యం చేద్దాం అనే ముఖ్యనినాదాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లారు. ప్రిస్కో నగర వాసులు 145 ఏరో కంట్రీ రోడ్, మెకిన్నీ, టెక్సాస్ 75071 లోని సోరింగ్ హైట్స్ వెన్యూ అనేది చిన్న ప్రైవేటు విమానాశ్రయం వద్ద ఉన్న ఒక ప్రత్యేకమైన ఈవెంట్ స్పేస్! ఈ ప్రదేశం సముద్రపు నీటి మట్టానికి 765 అడుగుల ఎత్తులో ఉంది. లగ్జరీ వసతి కలిగిన సోరింగ్ హైట్స్ లో ప్రిస్కో నగర వాసులు మేయర్ అభ్యర్థి మార్క్ హిల్ తో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, వివిధ రంగాల ప్రముఖులు హాజరు కావడంతో విజయవంతం అయింది. ఈ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ మార్క్ హిల్ తో నేరుగా మాట్లాడే అవకాశం లభించింది. ఈ సందర్భంగా ప్రిస్కో నగర అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి నార్త్ అమెరికా పద్మశాలి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంతోష్ అంకం నాయకత్వం వహించారు. ఈ ఇంటరాక్టివ్ సెషన్ లో ప్రిస్కో మేయర్ అభ్యర్థి మార్క్ హిల్ మాట్లాడుతూ ప్రిస్కో నగరంలో తన కుటుంబం గత 20 ఏళ్ళుగా నివాసం ఉంటున్నట్లు చెప్పారు.
ప్రిస్కో నగరం వ్యాపార వృద్ధికి, పిల్లల చదువులకు, భద్రతకు ఎంతో అద్భుతమైన నగరమని మార్క్ హిల్ పేర్కొన్నారు. ఇటీవల నగరంలో పెరుగుతున్న భిన్నత్వానికి వ్యతిరేకంగా కొందరు చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలను హిల్ తీవ్రంగా ఖండించారు. ద్వేషపూరితమైన, విభజన తెచ్చే ప్రసంగాలు వల్ల నగర ప్రతిష్ట దెబ్బతింటుందని, అలాంటి వాతావరణం ఉంటే ప్రపంచం నలుమూలల నుండి వచ్చే పెట్టుబడులు రావడానికి వెనుకాడుతాయని మార్క్ హిల్ హెచ్చరించారు. రాజకీయాల కంటే ప్రజలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ, అందరినీ కలుపుకుపోయే నాయకత్వం నగరానికి అవసరమని హిల్ స్పష్టం చేశారు. తనకు గతంలో ప్రిస్కో ఐఎస్డీ స్కూల్ బోర్డు ప్రెసిడెంట్ గా, అలాగే ఎకనామిక్ డెవలప్మెంట్ కార్పొరేషన్ బోర్డులలో పనిచేసిన అనుభవం ఉందని మార్క్ హిల్ తెలిపారు. విద్యా రంగం, ఆర్థికాభివృద్ధి, ఎగ్జిక్యూటివ్ లీడర్ షిప్ అనే మూడు కీలక స్తంభాలపై పూర్తి అవగాహన ఉన్న అభ్యర్థిని తాను మాత్రమేనని మార్క్ హిల్ వివరించారు. స్థానిక నివాసితులకు పన్నుల భారం తగ్గించాలంటే వాణిజ్య పన్నుల వ్యవస్థను బలోపేతం చేయాలని మార్క్ హిల్ అభిప్రాయపడ్డారు.ప్రపంచ స్థాయి సంస్థలను, ఉపాధి అవకాశాలను నగరానికి తీసుకురావడం ద్వారా స్థానికులకు మేలు జరుగుతుందని, పన్నుల ఉపశమనం లభిస్తుందని మార్క్ హిల్ నొక్కి చెప్పారు. కేవలం రోడ్లు నిర్మించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తీరవని, టెక్నాలజీ ఆధారిత స్మార్ట్ సిగ్నల్స్, కనెక్టెడ్ వెహికల్ డేటా, మెరుగైన రవాణా భాగస్వామ్యాల ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించాలని తన ప్రణాళికగా మార్క్ హిల్ హామీ ఇచ్చారు. ప్రిస్కో నగరాన్ని వివాదాలకు దూరంగా, మరింత పారదర్శకంగా, ఐక్యంగా ఉంచుతూ భవిష్యత్తు వైపు నడిపించడానికి తనకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను మార్క్ హిల్ కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో నార్త్ అమెరికా పద్మశాలి అసోసియేషన్ నాయకులు కిరణ్ దాసరి, తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలు

- వరంగల్ వాసవి క్లబ్‌ను సందర్శించిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సిద్ధ వెంకట సూర్యప్రకాష్ రావు

వరంగల్, ఆయుధం: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ వాసవియన్ సౌభాగ్య సేవ సంకల్ప సిద్ధ వెంకట సూర్యప్రకాష్ రావు శనివారం వరంగల్ వాసవి క్లబ్‌ను సౌజన్య పూర్వకంగా సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా క్లబ్ అధ్వర్యంలో ఉదయం నుండి అనేక రకాల భారీ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. వాసవి మాత దేవాలయం, వేంకటేశ్వర స్వామి దేవాలయాల సందర్శనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం పలు చోట్ల క్లబ్ సభ్యులు ఉదారంగా విరాళాలు, వస్తువులను పంపిణీ చేశారు. భద్రకాళి దేవాలయానికి 1 అల్మారా, లక్ష్మీ దేవి ఆలయానికి 6 అల్మారాలు, అలాగే వాసవి భవన ప్రాంగణంలో ఒక హుండీ, మరొక అల్మారాను బహూకరించారు. స్వయంకృషి వృద్ధాశ్రమానికి ఒక వాటర్ డిస్పెన్సర్‌ను అందజేశారు. రీజినల్ కంటి ఆసుపత్రి కొరకు 50 ప్లాస్టిక్ కుర్చీలను విరాళంగా ఇచ్చారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. దేశానికి సేవ చేసిన 5 గురు విశ్రాంత సైనికులను ప్రత్యేకంగా సన్మానించారు. పేద ప్రజలకు పెన్షన్ల పంపిణీ, నిరుపేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. వీటితో పాటు సమాజ శ్రేయస్సు కోసం మరెన్నో సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సిద్ధ వెంకట సూర్యప్రకాష్ రావు తో పాటు వరంగల్ వాసవి క్లబ్ ప్రతినిధులు, సభ్యులు ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ శిక్షణ తరగతులు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి..)

విఫలమైందని విమర్శించారు. ఇటీవల కాలంలో బీజేపీ ఎదుగుదలను చూసి ఓర్వలేక కొన్ని స్వార్థ రాజకీయ శక్తులు తనపై, పార్టీపై కుట్రపూరిత అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, ఇలాంటి చౌకబారు విమర్శలకు కార్యకర్తలు ఎవరూ అధైర్యపడకుండా ప్రజా క్షేత్రంలోనే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో దేశం సాధిస్తున్న ప్రగతిని రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ, ప్రజల్లో విశ్వాసాన్ని నింపాలని సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కళ్యాణ్ నాయక్, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, రాష్ట్ర కార్యదర్శి తూటుపల్లి రవి, జిల్లా ప్రబారి కొండపల్లి శ్రీధర్ రెడ్డి, మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి, ఈ శిక్షణ తరగతుల్లో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు వంగాల సమ్మిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మల్లాడి తిరుపతిరెడ్డి, మంజులారెడ్డి, కంభంపాటి పుల్లారావు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695